


# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## అంతర్వాహిని

**"హారికని చంపేయాలి"** కసిగా అనుకుంది అపర్ణ.

చిన్నప్పటినించి తను చదివిన క్రైం నవలలు, కథలు ఆమె మనసులో కదిలాయి. ప్రతీదాంట్లో చివర్లో హంతకుడు పట్టుపడతాడు. పిచ్చి వెధవ! ఏదో క్లూ వదిలేసి వెళ్తాడు. అలా కాకుండా హత్య అనే అనుమానం రాకుండా చంపేయాలి.

అంతలో ఆమె మనసు నిండా విచారం అలుముకుంది. 'ఈ హారిక పోతే ఇంకో సారిక వస్తుంది. అసలు చంపాల్సింది చంద్రమౌళిని' అనుకుంది. అప్రయత్నంగా చెంపలు వేసుకోబోయి బలవంతంగా ఆపేసింది.

మగబుద్ధి! ఏభై రెండేళ్ళు వచ్చి ఆ చిన్న పిల్లతో ఏంటి సరసాలు? ఆ పిల్లయినా ఈడు జోడు ఉన్నవాడిని చూసుకోవాలి కాని తనకంటే పదిహేడేళ్ళు పెద్దవాడితో ఏమిటి అన్ని కబుర్లు?

ఆ మధ్యాహ్నం పక్క ఫ్లాట్ తార తమ బెల్ కొట్టేదాకా అపర్ణ ఉత్తమ ఇల్లాలు. హత్యల గురించి కల్లో కూడా ఆలోచించని మంచి గృహిణి.

తార తీరిగ్గా వచ్చి సోఫాలో కూర్చుని చిరునవ్వుతో అడిగింది.

"బి బ్లాక్‌లో – 502 ఫ్లాట్‌లో ఉండే హారిక మీకు బంధువా?"

అపర్ణ అయోమయంగా చూసి తల అడ్డంగా ఊపి చెప్పింది.

"కాదు. ఆమెవరో కూడా తెలీదు. ఎందుకు?"

"అనుకున్నా" తార విలాసంగా వెనక్కి వాలింది.

అపర్ణ నుంచి ఎదురు చూసిన రెస్పాన్స్ రాకపోవడంతో తిరిగి తనే చెప్పింది.

"రోజూ మీ చంద్రమౌళిగారు ఆరింటికల్లా టంచన్‌గా ఆ ఫ్లాట్ ముందుంటారట. ఆయన దగ్గర డూప్లికేట్ కీ కూడా ఉందిట" చివరి మాటలు గొంతు తగ్గించి మరీ చెప్పింది.

అపర్ణకి ఓ నిమిషం అయోమయం అనిపించింది. చంద్రమౌళికి ఆ ఇంట్లో పనేంటి? హారిక ఎవరు? అదే అడిగింది.

"అందమైన అమ్మాయి. ఏదో బేంక్‌లో పనిచేస్తుంది. ముప్పై ఐదేళ్ళుంటాయి. ఐదున్నరకల్లా ఇంటికి వచ్చేస్తుంది. ఆరింటికి చంద్రమౌళిగారు తలుపు తీసి లోపలికి వెళ్ళి తలుపు మూస్తారు. మళ్ళీ ఎనిమిదికో తొమ్మిదికో తెరుచుకుంటుంది."

అపర్ణ నివ్వెరపోయింది.

దాదాపు నాలుగునెలలనించి చంద్రమౌళి ఇంటికి ఆలస్యంగా వస్తున్నాడు.

మొదటి రోజు అడిగింది. "ఇంత ఆలస్యమైందేమిటి?"

"ఆకలి దంచేస్తోంది. వడ్డించు" బాత్‌రూంలోకి వెళ్ళిపోయాడు.

అతనికి చెప్పడం ఇష్టంలేదని అర్థమయ్యాక మళ్ళీ ఆ ప్రశ్న అడగలేదు. కాని అపర్ణ ఎప్పుడూ ఈ కోణంలో ఆలోచించలేదు. స్నేహితులు, పేకాట, సినిమాలు ఇలాంటివే ఆలోచించింది.

"మీకెలా తెలుసు?" గొంతు పెగుల్చుకుని అడిగింది.

"దాని ఎదుటి ఫ్లాట్ 507 లోనేగా మా నీస్ ఉండేది? అది చెప్పింది. ఆ హారిక మీకు బంధువేమో అడుగుదామని వచ్చా. వస్తా" అపర్ణ అయోమయాన్ని పైశాచిక ఆనందంతో గమనిస్తున్న తార భారంగా లేచి బయటకి నడిచింది.

"హారికని చంపేయాలి" కసిగా అనుకుంది అపర్ణ.

రాత్రి ఎనిమిదిన్నరకి ఇంటికి వచ్చిన చంద్రమౌళి భార్యని కోరాడు.

"కాఫీ ఇస్తావా? డిన్నర్ కొంచెం లేట్‌గా తింటా."

అపర్ణ అందించిన కాఫీ తాగి కప్పు టీపాయ్ మీద పెడ్తూ చెప్పాడు.

"కాఫీ కలపడంలో నిన్నెవరూ ఓడించలేరు. ది బెస్ట్"

"ఐనా నేను పాత పడిపోయాగా" దుఃఖంగా అనుకుంది అపర్ణ. సాహసించి అతన్ని నిలదియ్యలేకపోయింది. తనకి తెలుసని తెలిస్తే అతను ఇంకా విశృంఖలంగా ప్రవర్తిస్తాడేమోననే అనుమానం కూడా ఉంది.

తమ ఫ్లాట్స్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సూపర్ మార్కెట్‌లో సరుకులు కొంటున్న అపర్ణ భుజం మీద చిన్నగా తట్టి తార చెప్పింది. "కాస్మెటిక్స్ సెక్షన్‌లో బ్లూ జీన్స్, వైట్ షర్ట్ అమ్మాయిని చూసారా?"

కొంచెం బొద్దుగా, చామన ఛాయలో ఉన్న ఆ అమ్మాయి సేల్స్‌గర్‌కి ఏదో ప్రొడక్ట్ చూపించి అది ఉందా అని అడుగుతోంది.

అపర్ణ అనుమానంగా తారవైపు చూసింది. తార తలాడించి చెప్పింది.

"ఆ అమ్మాయి హారిక."

మరోసారి ఆమె వైపు చూసిన అపర్ణ అడిగింది.

"అందగత్తె అన్నారు?"

"కాదా? మొహం చూడండి ఎంత కళగా ఉందో! కొంచెం లావు అంతే." తార సమర్థించుకుంది.

ఆ రాత్రి తొమిదిగంటలకి ఇంటికి వచ్చిన చంద్రమౌళి సోఫాలో కూర్చుని ఫోన్లో ఏదో  చూస్తున్న భార్యని అడిగాడు.

"ఎవరితో ఛాటింగ్?"

అపర్ణ చిరునవ్వు నవ్వింది.

"ప్రాపర్టీ టేక్స్ కట్టాను. పొద్దుట్నించీ ట్రై చేస్తూంటే సర్వర్‌డౌన్. ఇప్పుడు దొరికింది. ఏప్రిల్‌లో కట్టేస్తే ఫైవ్ పర్సంట్ ఎర్లీ బర్డ్ డిస్కౌంట్ ఉంటుందని" ఫోన్ పక్కన పెట్టి చెప్పింది.

చంద్రమౌళి పక్క సోఫాలో కూర్చుని టి.వి ఆన్ చేసాడు.

"నా పక్కన కూర్చోవచ్చుగా" అపర్ణ మనసు బాధగా మూలిగింది.

లేండ్‌లైన్ ఫోన్ మోగింది. అపర్ణ పక్కనే ఉన్న కార్డ్‌లెస్ రిసీవర్ని అందుకుంది.

"హలో."

"అపర్ణగారా?" ఓ ఆడకంఠం వినిపించింది.

"యస్?"

"నేను హారికని. చందూగారు మా ఇంట్లో మొబైల్ మర్చిపోయారు. వచ్చి తీసుకుంటారని కాల్ చేసాను" ఆ అమ్మాయి చెప్పింది.

"చెప్తాను. ఉంటా" అపర్ణ ఫోన్ లైన్ కట్ చేసి భర్తతో చెప్పింది.

"ఎవరో హారికట. మీ ఫోన్ వాళ్ళింట్లో మర్చిపోయారట. వచ్చి తీసుకెళ్లమని."

చంద్రమౌళి జేబులు తడుముకుని ఇబ్బందిగా చూసి కొడుకుని పిలిచాడు..

"నానీ బి బ్లాక్ 502లో నా ఫోన్ మర్చిపోయాను. వెళ్ళి తెస్తావా?"

వాడు తలూపి బయటకి నడిచాడు.

ఇంట్లో నిశ్శబ్దం.

చంద్రమౌళి ఏ భావమూ లేని గొంతుతో చెప్పాడు.

"నీకు నా ఫ్రెండ్ కాశీ తెలుసుగా? వాళ్ళ చెల్లెలి కూతురు. 'అక్కడే ఉంటావు కదరా. మా మేనకోడలి మంచి చెడ్డలు కాస్త చూస్తూండు" అన్నాడు.

"రోజూ!"

"హోం సిక్ పోవాలని.."

"మనింటికి పిలవాల్సింది. నాలుగునెలలైనా హోంసిక్ తగ్గలేదేమో పాపం. మనమ్మాయి పద్దెనిమిదేళ్ళకే చదువుకోడానికి లండన్ వెళ్ళింది. నెలలో అడ్జస్ట్ అయింది. హైదరాబాద్‌లో తెలుగు మాట్లాడే ప్రాంతంలో కూడా ఈ అమ్మాయికి హోం సిక్" అపర్ణ నవ్వింది.

"హారిక చాలా ఇంటిలిజెంట్. తనకి తెలీని విషయమే లేదు. తనతో మాట్లాడుతూంటే రోజుకో కొత్త విషయం తెలుస్తుంది. గలగల మాట్లాడుతుంది. ఆ మాటల్లో సెన్స్‌లెస్ మాటలు అసలుండవు..." చంద్రమౌళి ఉత్సాహంగా చెప్పాడు.

"ఓ!"

"మనింటికి రమ్మన్నాను. 'ఆంటీతో నాకేం మాటలుంటాయి. రాను' అని మొహమాటం లేకుండా చెప్పేసింది."

"మీరు నాకంటే నాలుగేళ్ళు పెద్దని చెప్పలేదూ?"

"స్నానం చేసొస్తా. వడ్డించెయ్" చంద్రమౌళి లేచి గదిలోకి వెళ్ళిపోయాడు. ఫోన్ తీసుకొచ్చిన నానీ దాన్ని టేబుల్ మీద పెట్టి చెప్పాడు.

"ఆ అక్క భలే మాట్లాడుతుందమ్మా"

"తెలుసు" అపర్ణ చెప్పింది.

ఉదయంనుంచి అపర్ణ మనసు మనసులో లేదు. 'ఇంత పొరపాటు చేసానేంటీ?' అని తనని తానే తిట్టుకుంది. చంద్రమౌళి కోసం ట్రై చేస్తే ఫోన్ కవరేజ్ ఏరియాలో లేదనే సమాధానం వస్తోంది. అన్యమనస్కంగానే ఇంటి పనులు చేస్తూ అతని కాల్ కోసం ఎదురు చూడసాగింది.

చివరికి సాయంత్రం నాలుగుకి ఫోన్ మోగింది.

"ఇప్పుడే లాండయ్యా. హోటల్‌కి వెళ్ళగానే మళ్ళీ కాల్ చేస్తాను" చంద్రమౌళి చెప్పాడు.

"ఒక్క నిమిషం! పొరపాటున మీ థైరాయిడ్ మందు పెట్టెలో సర్దడం మర్చిపోయాను. షేవింగ్ కిట్‌కూడా. అలసటగా ఉందనకుండా దారిలో ఎక్కడైనా థైరో నార్మ్ సెవెంటీఫైవ్, చిన్న ట్రావెల్ పేస్ట్, బ్రష్, షేవర్ కొనుక్కోండి. ఐ

యాం వెరీ సారీ. మీరు ఎప్పుడు కేంప్‌కి వెళ్ళినా ఒకటికి పదిసార్లు చూసేదాన్ని అన్ని పెట్టానా లేదా అని. ఈసారెందుకో ఇంతపెద్ద పొరపాటు.." అపర్ణ గొంతు గద్గదంగా మారింది.

చంద్రమౌళి గలగలా నవ్వాడు.

"హలో ఇంత చిన్న విషయానికే కన్నీళ్ళా? నేను కేంప్‌కి అడవికి రాలేదు. సిటికే వచ్చా. అన్నీ కొనుక్కునే రూంకి వెళ్తా.

అప్పూ నీ ఎఫిషియెన్సీ నాకు తెలుసు. పొరపాట్లు మానవ సహజం. అవి కొన్నాక ఫోటో తీసి అప్లోడ్ చేస్తా సరేనా? వారంలో వచ్చేస్తా. జాగ్రత్తగా ఉండండి." ఫోన్ పెట్టేసాడు.

అపర్ణ 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుంది.

వారం నించి చంద్రమౌళి సాయంత్రం ఆరింటికే ఇంటికి రావడం చూసి అపర్ణ ఆశ్చర్యపోయింది.

ఎనిమిదో రోజు అడిగింది.

"హారిక ఇల్లు మారిందా?"

"లేదు. నేనే వెళ్ళడంలేదు" ముభావంగా చెప్పాడు.

"ఏం?"

"నువ్వన్నట్లు ఇంకా ఎంతకాలం హోం సిక్‌నెస్ ఉంటుంది? అడ్జస్ట్ అవుతుందిలే."

"కాదు. ఇంకేదో కారణం ఉంది."

చంద్రమౌళి మాట్లాడలేదు. అపర్ణ రెట్టించలేదు.

ఆ రాత్రి అపర్ణ చేతివేళ్ళతో ఆడుకుంటూ చెప్పాడు.

"నేను కేంప్‌కి వెళ్ళినప్పుడు నువ్వు నా మెడిసిన్స్, షేవింగ్ కిట్ సర్దడం మర్చిపోయావు కదా. వచ్చాక ఓ రోజు మాటల్లో ఆ విషయం హారికకి చెప్పాను. పగలబడి నవ్వింది."

ఆ చీకట్లో అపర్ణ మొహం ఎర్రబడింది.

"మీ ఆవిడ ఇంత డంబ్‌హెడ్ ఏంటి? పొద్దున నిద్రలేవగానే అవసరమైనవే పెట్టలేదా? అందుకే ఇలాంటి తలకాయలేని ఆడవాళ్ళతో మాట్లాడడం నాకిష్టం ఉండదు. ఇగ్నొరెంట్ పీపుల్ ' అంది."

అపర్ణ అతని చేతుల్లోని తన చేతిని వెనక్కు లాక్కుంది. చంద్రమౌళి దాన్ని గట్టిగా పట్టుకుని చెప్పాడు.

"నిన్ను అనడానికి తనెవరు? నా ఎదురుగా నా పెళ్ళాన్ని డంబ్‌హెడ్, బుర్ర తక్కువ అందంటే నేనా అమ్మాయికి ఎంత అనవసర చనువు ఇచ్చానో అర్థమైంది. ఏం మాట్లాడకుండా లేచి వచ్చేసాను. నా దగ్గర తన ఫ్లాట్ డూప్లికేట్ కీ ఉంది. దాన్ని అక్కడే పెట్టి వచ్చేసా."

చంద్రమౌళిని చంపేయాలి అన్న పాత ఆలోచనకి అపర్ణ అప్రయత్నంగా రెండో చేత్తో చెంపలు వేసుకుంది.

**(వచ్చే సంచికలో మరో సరిగమ)**

Click here to share your comments